సాక్షి
చిత్తూరు
బుధవారం, 24, సెప్టెంబర్, 2025



విద్యుత్‌దీపాలంకరణలో తిరుమల శ్రీవారి ఆలయం (ఇన్‌సెట్) విష్వక్సేనుడి ఊరేగింపు





ఫల పుష్ప ప్రదర్శనశాల





ఉద్యానవనంలో ఏర్పాటుచేసిన మహాభారత ఘట్టం, ఆకట్టుకుంటున్న దేవతామూర్తుల చిత్రాలు

విష్వక్సేన వీక్షణ

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం నిర్వహించిన అంకురార్పణతో టీటీడీ శ్రీకారం చుట్టింది. బుధవారం నుంచి పూర్తిస్థాయి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ముందు వైఖానస ఆగమ శాస్త్ర నియమబద్ధంగా వేదపండితులు అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లను శ్రీవారి సేనాధిపతి శ్రీ విష్వక్సేనుడు తిరువీధుల్లో ఊరేగుతూ వీక్షించారు. సేనాపతి శంఖం, చక్రం, గద, ఖడ్గం తదితర ఆయుధాలను ధరించి ఛత్ర, చామర, మంగళ వాయిద్యాలతో భేరినాదాల నడుమ తిరుమాడ వీధుల్లో బంగారు తిరుచ్చి వాహనంపై వైభవంగా ఊరేగారు. అంకురార్పణ క్రతువులో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్ఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా తిరుమల కొండ విద్యుద్దీప కాంతులతో శోభిల్లుతోంది. ఉద్యానవనంలో టీటీడీ ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శనశాల భక్తులను ఆకట్టుకుంటోంది. బుధవారం నుంచి ప్రారంభమయ్యే వాహన సేవల్లో శ్రీ మలయప్ప స్వామి ఆయా వాహనాలపై ఆలయ మాడ వీధుల్లో వైభవంగా ఊరేగుతారు. – తిరుమల

న్యూస్‌రీల్

నేడు బాధ్యతలు చేపట్టనున్న జేడీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీగా ఉమామహేశ్వరి బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. తిరుపతి జిల్లాలో డీడీగా పనిచేస్తున్న ఆమెను చిత్తూరు జిల్లాకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది.

26న సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి చిత్తూరు జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ జిల్లా స్థాయి జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 26న నిర్వహించనున్నట్లు చిత్తూరు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చందు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 26న ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హులైన క్రీడాకారులు 2011 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఒరిజినల్ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికయ్యే క్రీడాకారులు అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో విశాఖపట్టణం జిల్లా, కేడీపేట నర్సీపట్టణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 9581887409, 7013989059 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో స్థిరమైన ఆదాయం



ప్రకృతి వ్యవసాయ రైతును సత్కరిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రకృతి వ్యవసాయంతో స్థిరమైన ఆదాయం పొందవచ్చని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రకృతి వ్యవసాయం అమలుపై సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు రాబోయే తరాలకు నీటిని సంరక్షించడం ప్రకృతి వ్యవసాయం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో పాడిరైతులను అభివృద్ధి చేసి పశుగ్రాసం పెంచేందుకు సహజ, సేంద్రియ వ్యవసాయ విధానాలను అమలు చేయాలన్నారు. డీఆర్‌డీఏ, కృషి విజ్ఞాన కేంద్రాలు, గ్రామ పంచాయతీ, పలు శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రకృతి వ్యవసాయ లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు మాట్లాడుతూ జిల్లాలో 35,211 మంది రైతులు 34,633 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. జిల్లాలోని 260 క్లస్టర్లలో ఎస్ఎంఎంఎఫ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించిన వెంకటసుబ్బరాజు, నరేంద్ర, చందుకుమార్, సుజాత, సుమతి, నాగరాజు, చెంగల్‌రెడ్డి, మహేష్, కవితను దుశ్శాలువతో సత్కరించారు. రాయలసీమ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రావు, వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

రూ.480 కోట్లు జమ చేయండి!



మాట్లాడుతున్న మామిడి రైతులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతుల అకౌంట్లో తక్షణం రూ.480 కోట్లు జమ చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి రైతుల సంక్షేమ సంఘం కార్యవర్గం తీర్మానించింది. మంగళవారం చిత్తూరు ఎస్టీయూ కార్యాలయంలో మామిడి రైతుల సంక్షేమ సంఘం సమావేశం టి.జనార్దన్ అధ్యక్షతన జరిగింది. సంఘ నేతలు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో పల్ప్ ఫ్యాక్టరీలకు తోతాపురి మామిడి సరఫరా చేసి మూడు నెలలు దాటినా నేటికీ డబ్బులు జమ చేయక పోవడం దుర్మార్గమన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 35 వేల మంది రైతులు 4 లక్షల టన్నుల మామిడి సరఫరా చేసినట్టు వెల్లడించారు. 15 రోజుల్లోగా బిల్లులు చెల్లించాలనే నిబంధన ఉన్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కిలోకు రూ.12 చొప్పున చెల్లించాల్సి ఉందన్నారు. ప్రపంచ మామిడి దినోత్సవం సందర్భంగా చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలు సైతం మరిచారన్నారు. ఈనెల 30లోగా నగదు జమచేయకుంటే అక్టోబర్‌లో ప్రత్యక్ష ఆందోళనకు సంసిద్ధం కావాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు హేమలత, సీ.మునీశ్వర్‌రెడ్డి, కె.మునిరత్నంనాయుడు ఏ.ఉమాపతి నాయుడు, పీ.భారతి, బీ.మురళి, సహాయ కార్యదర్శులు ఎం.లవకుమార్‌రెడ్డి కే.హరిబాబు, చంద్రమౌళిరెడ్డి, కే.సురేంద్రన్, కోశాధికారి పీఎల్.సంజీవరెడ్డి, బీ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగన్‌పై కక్ష.. చిన్నారులకు శిక్ష

ఇదీ అప్పటి సీఎం వైఎస్ జగన్ మాట

'రాష్ట్రంలో చిన్న పిల్లలు ఎవరూ ఖరీదైన వైద్యం అందక మృతి చెందకూడదు. తన బిడ్డను అనారోగ్యం నుంచి కాపాడుకోలేకపోయాను అన్న బాధ ఏ తల్లి పడకూడదు. భావితరాల యువతను ఆరోగ్యంగా అందించే బాధ్యతను మా ప్రభుత్వం తీసుకుంటుంది. ఖరీదైన వైద్యం ఉచితంగా అందించే బాధ్యత తీసుకుంటున్నాం. ఎంత ఖర్చైనా , ఎలాంటి వ్యాధి అయినా సరే పిల్లలను రక్షించుకోవడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాధ్యత. అనారోగ్య సమస్యతో ఏ ఒక్కరూ పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో చిన్నపిల్లల కోసం శ్రీ పద్మావతి చిన్నపిల్లల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తున్నాం. రెండేళ్లలో ఈ ఆసుపత్రి ప్రారంభించుకొని పిల్లలకు పునర్జన్మను ప్రసాదించే దేవాలయంగా కొనసాగుతుంది' అని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఉద్ఘాటించారు.

చిన్నపిల్లల ఆసుపత్రికి గ్రహణం

- మల్టీ సూపర్ స్పెషాలిటీపై చిన్నచూపు
- నిధులు విడుదల చేయకుండా వేధింపులు
- వైఎస్ జగన్ మానసపుత్రిక అని ఆసుపత్రిపై అక్కసు
- నెలల తరబడి సాగదీస్తున్న భవన నిర్మాణ పనులు
- 2024 జూలైలో ప్రారంభించాలని సంకల్పించిన నాటి ప్రభుత్వం
- పనులు పూర్తి చేసేందుకు మీనమేషాలు లెక్కిస్తున్న టీటీడీ

తిరుపతి తుడా : తీవ్రమైన అనారోగ్య సమస్యల నుంచి చిన్నపిల్లలను కాపాడి ఆరోగ్యవంతమైన భావితరాన్ని ఆవిష్కరించేందుకు తిరుపతి లో శ్రీవారి పాదాల చెంత అలిపిరి సమీపంలో శ్రీ పద్మావతి చిన్నపిల్లల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థాపించాలని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పించారు. రాష్ట్రంలో చిన్న పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యాన్ని అందించే ఆసుపత్రి ఇప్పటి వరకు లేదు. ఆ లోటును అధిగమిస్తూ మొత్తం 15 రకాల ప్రత్యేక విభాగాల సామర్థ్యంతో అత్యాధునిక వైద్య సేవలను అందించాలని భావించారు. ఈ ఆసుపత్రి తన మానస పుత్రికగా ప్రకటిస్తూ 2022 మే 5వ తేదీన శ్రీవారి పాదాల చెంత అలిపిరి సమీపంలో భూమి పూజ చేశారు. రెండేళ్ల లో భవన నిర్మాణాలు పనులు పూర్తి చేసుకుని, వైద్య పరికరాల కొనుగోలు, సిబ్బంది నియామకం ప్రక్రియ పూర్తి కావాలని టీటీడీ అధికారులను ఆదేశించారు. ఇందుకు తగ్గట్టే 2024 జూలైలో ఆసుపత్రిని ప్రారంభించేలా టీటీడీ సైతం యుద్ధ ప్రాతిపదికన పనులను దాదాపుగా పూర్తి చేసింది.

15 విభాగాలతో ...

చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని 15 విభాగాలతో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలానే అవయవ మార్పిడి, ఇతర అత్యవసర వైద్య సేవల కోసం భవనంపై హెలీప్యాడ్‌ను నిర్మించాలని, ఆ దిశగా డిజైన్ చేశారు. ఈ ఆసుపత్రిలో చిన్నపిల్లల కార్డియాలజీ, న్యూరాలజీ ,న్యూరో సర్జరీ, పల్మనాలజీ, ఆర్థో, ఆంకాలజీ వంటి మొత్తం 15 ప్రత్యేక విభాగాలను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టారు. అత్యాధునిక ఐసీయూ, ఆర్ఐసీయూ, 8 ఆపరేషన్ థియేటర్లు, ఎంఆర్ఐ, సిటీ యంత్రాలు, ఆధునిక ల్యాబ్ ఉండేలా ప్రణాళికలు చేశారు.

పాలక మండలిలో భిన్నాభిప్రాయాలు

ఈ ఆస్పత్రి పూర్తి చేసే విషయంలో టీటీడీ పాలక మండలి వేర్వేరు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. పాలకవర్గ అధిపతిగా ఉన్న వ్యక్తితో పాటు మరో నలుగురు ఆస్పత్రి పట్ల వ్యతిరేకతతో ఉన్నట్లు సమాచారం. కోట్లాది రూపాయల భారం టీటీడీ ఎందుకు భరించాలంటూ ఆ ఐదుగురు ఆసుపత్రిని వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే ఆసుపత్రి నిర్మాణంలో అవకతవకలు జరిగాయంటూ బురదజల్లి ఆసుపత్రిని అడ్డుకుందామంటూ చర్చించినట్లు తెలుస్తోంది. అయితే ఎక్కువ మంది బోర్డు సభ్యులు వైద్యం కోసం టీటీడీ ఎంత ఖర్చు పెట్టినా తప్పేమీ లేదని, ముఖ్యంగా చిన్న పిల్లలకు సంబంధించిన ఆసుపత్రి కాబట్టి వెంటనే నిధులు మంజూరు చేసి పనులు పునః ప్రారంభించేలా చొరవ తీసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందంటూ కుండ బద్దలు కొడుతున్నారు. అయినా ఆ వ్యక్తి మనసు కరగకపోవడంపై బోర్డు సభ్యులు అసంతప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రిని పూర్తి చేయకపోతే కూటమి ప్రభుత్వానికి ప్రజా వ్యతిరేకత తప్పదని, దేవుడితో సమానమైన చిన్న పిల్లల విషయంలో మీనమేషాలు లెక్కించడం మంచిది కాదని జిల్లాకు చెందిన కొంతమంది టీటీడీ బోర్డు సభ్యులు తెగేసి చెప్పినా ఆ వ్యక్తి మాత్రం వినీ విననట్లు వదిలేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. చిన్నపిల్లల ఆసుపత్రి విషయంలో ఇంతలా పట్టుబట్టడం మంచిది కాదని టీటీడీ అధికారులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కార్డియాక్ సెంటర్‌తోనే ప్రేరణ

అభం శుభం తెలియని పసిపిల్లలు గుండె సమస్యతో బాధపడుతూ మృత్యువాత పడుతున్న విషయాన్ని గుర్తించిన నాటి సీఎం వైఎస్ జగన్ తిరుపతిలో శ్రీ పద్మావతి చిన్నపిల్లల కార్డియాక్ కేర్ సెంటర్‌ను 2022లో ప్రారంభించారు. ఈ ఆసుపత్రి అనతి కాలంలోనే ప్రాచుర్యం పొందింది. వేల మందికి గుండె సంబంధిత సమస్యలను పరిష్కరించి పిల్లల పాలిట సంజీవినిగా మారింది. ఇప్పటి వరకు 20 మందికి గుండె మార్పిడి చికిత్సలను విజయవంతంగా అందించింది. పొరుగు రాష్ట్రాల నుంచి కాక బంగ్లాదేశ్ నుంచి సైతం వచ్చి ఇక్కడ గుండె సంబంధిత వైద్య సేవలను ఉచితంగా పొందారు. ఈ ఆసుపత్రి పురుడు పోసుకున్న అనతి కాలంలోనే సత్ఫలితాలు వచ్చాయి. ఇదే ప్రేరణతో చిన్న పిల్లలకు గుండె సంబంధిత వైద్యమే కాదు మొత్తం 15 రకాల ప్రత్యేక విభాగాలతో ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో సూపర్ స్పెషాలిటీ వైద్యం అవసరమని భావించారు. ఈ బాధ్యతను టీటీడీకి అప్పగించారు. చక చకా అనుమతులు పొంది 2022 మే 5వ తేదీన ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేశారు.



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తిరుపతిలో గుండె చికిత్సల కోసం ప్రారంభించిన చిన్నపిల్లల ఆసుపత్రి.. నేడు నిధులు లేక ఆగిపోయిన దృశ్యం

వైఎస్ జగన్‌కు పేరొస్తుందనే..

నాటి సీఎం వైఎస్ జగన్ తన మానస పుత్రికగా ప్రకటించి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పట్టాలెక్కించారు. రాష్ట్రంలో ఎక్కడైనా విధంగా ప్రపంచ స్థాయి వైద్య ప్రమాణాలతో ఈ ఆసుపత్రిని ప్రారంభిస్తే వైఎస్ జగన్‌కు పేరొస్తుందనే అక్కసుతోనే పనులను కొనసాగించకుండా నేటి ప్రభుత్వంలోని కూటమి నేతలు అడ్డుకట్ట వేశారు. ఆసుపత్రిని పూర్తి చేయకుండా కాకమ్మ కథలు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. నిధులు మంజూరు చేయకుండా పనులను కొనసాగకుండా టీటీడీ బోర్డులోని ముఖ్యమైన వ్యక్తి అడుగడుగునా అడ్డుపడుతున్నట్లు తెలుస్తోంది. ఏడాది క్రితమే ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకు రావాల్సి ఉండగా మరో రెండేళ్ల పాటు సాగదీసి ఆపై నిర్ణయం తీసుకునేందుకు కుట్రలు పన్నుతున్నట్లు తెలుస్తోంది.

నిధులు మంజూరు కాకుండా అడ్డుపడి..

ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా ప్రారంభించారు. అంతే వేగంగా పనులు చకచకా సాగిపోయాయి. అంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో విడుదల చేసిన నిధులతో 2024 చివర వరకు పనులు కొనసాగాయి. టీటీడీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టింది. టీటీడీలో నిర్మిస్తున్న పలు భవనాలను సందర్శించింది. ఈ క్రమంలో చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనాన్ని సందర్శిస్తూ టీటీడీకి ఇంత భారం అవసరమా అంటూ పాలకవర్గంలోని ఓ ముఖ్యమైన వ్యక్తి తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే కొంత మంది బోర్డు సభ్యులు కలగజేసుకొని చిన్న పిల్లల వైద్యం కోసం టీటీడీ ఖర్చు చేయడం ఏ మాత్రం తప్పు కాదని, పనులు పూర్తి చేయకపోతే చెడ్డపేరు వస్తుందని ఆ వ్యక్తికి సూచించారు. భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ఈ సమయంలో ఆసుపత్రిని అర్ధాంతరంగా వదిలేస్తే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకత తప్పదని ఒకరిద్దరు బోర్డు సభ్యులు హెచ్చరించారు. ఆ ముఖ్యమైన వ్యక్తి అయిష్టంగానే అంగీకరించినా ఆపై తన వక్రబుద్ధిని ప్రదర్శించారు. ఆసుపత్రి నిర్మాణానికి ఎక్కువ నిధులు కేటాయించారంటూ నిధులు మంజూరు కాకుండా అడ్డు పడ్డారు. గడిచిన ఏడెనిమిది నెలలుగా నిధులు మంజూరు చేయకుండా చక్రం తిప్పారు. దీంతో పనులను అర్ధాంతరంగా ఆగిపోయాయి.

ఆసుపత్రి పేరు : శ్రీ పద్మావతి చిన్నపిల్లల మల్టీ సూపర్ స్పెషాలిటీ
నిర్వహణ బాధ్యత : టీటీడీ
వైద్య సేవలు : పూర్తిగా ఉచితం
ఆసుపత్రి నిర్మాణ వ్యయం : రూ.320 కోట్లు
ఆస్పత్రి విస్తీర్ణం : 4 లక్షల 11 వేలా 325 చదరపు అడుగులు
అంతస్తులు : ఆరు
బెడ్ల సామర్థ్యం : 350
ఆసుపత్రిలో విభాగాలు : మొత్తం 15
ఆసుపత్రి ప్రత్యేకత : అత్యవసర వైద్య సేవలు కోసం భవనంపైనే హెలిప్యాడ్ నిర్మాణం

పీవీకేఎన్‌లో అతిథి అధ్యాపక పోస్టులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పీవీకేఎస్ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పీవీకేఎన్ స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఇంగ్లిష్, బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, వ్యాయామశాస్త్ర విభాగాల లో అతిథి అధ్యాపకులుగా పనిచే సేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టులలో 55 శాతం ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న వాళ్లకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26 లోపు తమ దరఖాస్తులను పీవీకేఎన్ కళాశాలలో అందజేయాలని సూచించారు.

బాబు మోసాలపై పోరాటాలకు సిద్ధం



క్యూఆర్‌కోడ్ పోస్టర్లను విడుదల చేస్తున్న విజయానందరెడ్డి, నాయకులు



పాల్గొన్న స్థానిక మహిళలు

- తేనబండలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం
- పాల్గొన్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: అబద్ధాలు, దుష్ప్రచారాలు, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పేదలకు సంక్షేమం, అభివృద్ధిని దూరం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి విమర్శించారు. మంగళవారం 22వ డివిజన్ తేనబండలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లీనారెడ్డి, నాయకులు జగ్గ, మురళీనాయకర్ల ఆధ్వర్యంలో ×బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ¤ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తేనబండలో పార్టీ కార్యకర్తల పై కూటమి నాయకులు కక్ష గట్టి కేసులు పెట్టారని గుర్తుచేశారు. నీవా నది చుట్టూ ప్రహరీ గోడ కడుతాం, కొత్తగా లిల్లీబ్రిడ్జి నిర్మిస్తామన్న ప్రజాప్రతినిధి హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రజలు చంద్రబాబుకు వేసిన ఒక్క ఓటు వల్ల డివిజన్ వాసులు అక్షరాలా ఏడాదిలో రూ.కోట్లు నష్టపోయారని తెలిపారు. గతంలో ఏ పథకం ప్రవేశపెట్టినా మహిళల పేరుతోనే అమలు చేశారని గుర్తుచేశారు. అనంతరం నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, లీనారెడ్డి, మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిణిరెడ్డి మాట్లాడారు. చివరిగా క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు అంజలిరెడ్డి, అను, చాన్‌బాషా, నవాజ్, నౌషద్, నారాయణ, చక్రీ, మురళీ, చామంతి, అబిద్‌బాషా, సాధిక్‌బాషా, అస్లాంబాషా, బావాజాన్, అరుణ్, రాజేష్, కుమారేష్, జ్యోతి, జాన్ పాల్గొన్నారు.

గిరిజనులకు కలెక్టర్ వరాలు



గువ్వలగుట్టలో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



గిరిజనుల గుడిసెలు పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సోమల(చౌడేపల్లె): సోమల మండలం, ఇరికిపెంట పంచాయతీ, పాయలగుట్ట, గువ్వలగుట్ట గిరిజనులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ వరాలు కురిపించారు. మంగళవారం అధికారులతో కలిసి ఆయన కాలినడకన గిరిజనులున్న ప్రాంతాలకు చేరుకొని వారితో మమేకమయ్యారు. తర్వాత సమస్యలపై ఆరా తీశారు. గుడిసెలు, పాకల్లో నివాసమున్న 14 మందికి పక్కా గృహాలు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక్కో ఇంటికి రూ.1.5 లక్షల చొప్పున మంజూరు చేస్తామన్నారు. ఆధార్, రేషన్ కార్డులు లేని వారిని గుర్తించి వెంటనే జారీచేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థినీ బడికి పంపాలని, విద్యతో గిరిజన కుటుంబాల్లో మార్పు వస్తుందని సూచించారు. పాయలగుట్ట గ్రామస్తులనడిగి సమస్యలు తెలుసుకున్నారు. దారిసౌకర్యం కల్పించాలని కోరారు. చెన్నపట్నం చెరువు కట్టకింద గువ్వలగుట్టకు వేళ్లే మార్గంలో దారికి గండిపడి కోతకు గురైందని, వెళ్లడానికి ఇబ్బందికరంగా మారిందని చెప్పడంతో వెంటనే కల్వర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పాయలగుట్టలో హేచరీ వల్ల ఇబ్బంది పడుతున్నామని కలెక్టర్‌కు తెలిపారు. గువ్వలగుట్టలో యానాది కవిత, పాయలగుట్టలో హనుమంతప్ప పేరిట భూమి పట్టాతోపాటు కరెంటు సర్వీసు వెంటనే మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డీపీఓ సుధాకర్, తహసీల్దార్ మధుసూదన్, ఎంపీడీఓ ప్రసాద్, ఇరిగేషన్ అధికారిణి ఝాన్సీ, సర్పంచ్ రెడ్డెప్ప, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులనాయుడు, ఇరికిపెంట చెరువు కట్ట చైర్మన్ గల్లా బోస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి కేసులో మైనర్‌కు రెండేళ్ల ప్రొబేషన్

పలమనేరు: గంజాయి కేసులో పట్టణానికి చెందిన ఓ మైనర్‌కు తిరుపతి జువెనైల్ జడ్జి రెండేళ్ల ప్రొబేషన్ విధించినట్టు స్థానిక సీఐ మురళీమోహన్ మంగళవారం విలేకరులకు తెలిపారు. పట్టణంలోని గంటావూరులో 2023 జూలై 6న గంజాయిని కలిగి ఉన్న కేసులో ఓ మైనర్‌పై స్థానిక పోలీసులు ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారించిన తిరుపతి జువెనైల్ జస్టిస్ నిందితునికి రెండేళ్లపాటు చిత్తూరు జిల్లా ప్రొబేషన్ అధికారి సూపర్‌వైజింగ్‌లో ఉండాలని తీర్పునిచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.

ఫోన్ మాట్లాడొద్దన్నందుకు భార్య ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: తరచూ ఫోన్ మాట్లాడొద్దు అని భర్త సూచించడంతో తీవ్ర మనోవేదనకు గురైన వివాహిత షేక్ తసీమ్ (22) సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. చిత్తూరు టూటౌన్ ఎస్‌ఐ రమేష్ కథనం.. పాకాలకు చెందిన తసీమ్‌కు చిత్తూరు నగరంలోని దుర్గానగర్ కాలనీకి చెందిన సుల్తాన్‌బాషాతో పెద్దలు పెళ్లి చేశారు. సుల్తాన్ సాదీలోని ఓ కాఫీ దుకాణంలో పనిచేస్తున్నాడు. భార్యకు ఫోన్ చేసి, తన తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని, తరచూ ఫోన్ మాట్లాడుతూ ఉండొద్దంటూ సూచించాడు. దీంతో మనస్తాపం చెందిన తసీమ్ తన చీరను సీలింగ్ ఫ్యాన్‌కు ముడేసి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తమ్ముడు షబ్బీర్ బాషా మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) అడ్మిషన్లకు అపరాధ రుసుం రూ.200తో గడువు పొడిగించారని డీఈవో వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే పది, ఇంటర్మీడియట్ పరీక్షలను అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2025–26 విద్యాసంవత్సరంలో పది, ఇంటర్మీడియట్ పూర్తి చేసేందుకు రూ.200 అపరాధరుసుంతో ఈ నెల 31లోపు అడ్మిషన్‌లు పొందవచ్చన్నారు. అభ్యర్థులు పూరించిన దరఖాస్తులను మీసేవా, ఏపీ ఆన్‌లైన్ లో అప్‌లోడ్‌చేసి ఎంపిక చేసిన ఓపెన్ స్కూల్ సెంటర్‌ల ఆధ్వర్యంలో అడ్మిషన్‌లు పొందే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు డీఈవో కార్యాలయంలోని ఓపెన్ స్కూల్ విభాగంలో సంప్రదించవచ్చని డీఈవో వెల్లడించారు.

ప్రభాకర్ కోసం ముమ్మర గాలింపు

- 15 ప్రత్యేక బృందాల ఏర్పాటు
- 70 కేసుల్లో ముద్దాయి
- నాలుగు రాష్ట్రాల్లో కేసులు
- ఇద్దరు ఎస్కార్ట్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్
- డీఎస్పీ దేవకుమార్

దేవరపల్లి: పోలీసుల కళ్లు కప్పి సోమవారం రాత్రి పారిపోయిన కరుడు గట్టిన నేరస్తుడు బత్తుల ప్రభాకర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివిధ కేసుల్లో ముద్దాయిగా ఉండి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఖైదీగా ఉన్న ప్రభాకర్ తూర్పు గోదావరి జిల్లా, దేవరపల్లి మండలం, దుద్దుకూరు వద్ద చేతులకు బేడీలతో పరారైన ఘటన పాఠకులకు తెలిసిందే. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏలూరు డీఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, సీఐ నాగేశ్వరనాయక్ ఘటనా స్థలానికి చేరుకుని నేరస్తుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 50 మంది యువకులతో బైక్‌లపై పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. అర్ధరాత్రి వరకు యువకులు, పోలీసులు పొలాల్లో గాలించారు.

కరుడుగట్టిన నేరస్థుడు ప్రభాకర్

చిత్తూరు జిల్లాకు చెందిన బత్తుల ప్రభాకర్ కరుడుగట్టిన నేరస్తుడని పోలీసులు చెబుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల్లో అతనిపై అనేక కేసులు ఉన్నాయి. పలు కేసుల్లో రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉంటున్నాడు. సోమవారం ఉదయం ఒక కేసులో పోలీసులు విజయవాడ కోర్టుకు తీసుకు వెళ్లి తిరిగి వస్తుండగా దేవరపల్లి మండలం, దుద్దుకూరు వద్ద హైవేపై గల హోటల్ వద్ద ఆగారు. ఆ సమయంలో ప్రభాకర్ టీ తాగడానికి చేతులకు ఉన్న హ్యాండ్స్ కప్స్‌ను ఒక చేతిది తీసి మరొక చేతికి ఉంచారు. టీ తాగుతున్న క్రమంలో ప్రభాకర్ ఎస్కార్ట్ పోలీసుల కళ్లు కప్పి హోటల్ వెనుక నుంచి పొలాల్లోకి పరారయ్యాడు. పోలీసులు వెంటపడినప్పటికీ దొరకలేదని డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. ప్రభాకర్‌కు ఇద్దరు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు ఎస్కార్ట్‌గా వెళ్లారు. వీరిద్దరిని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ సస్పెండ్ చేశారు.



దుద్దుకూరు వద్ద ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్ (ఇన్ సెట్) నేరస్తుడు బత్తుల ప్రభాకర్ (ఫైల్)

15 ప్రత్యేక బృందాల ఏర్పాటు

పోలీసుల కళ్లుకప్పి పరారైన నేరస్థుడు బత్తుల ప్రభాకర్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. మంగళవారం దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముద్దాయి కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. నేరస్థుడు ప్రభాకర్‌పై ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళలో సుమారు 80 కేసులు నమోదైనట్టు తెలిపారు. 2011 నుంచి ప్రభాకర్ నేరాలకు పాల్పడుతూ పట్టుబడినట్టు ఆయన చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి, ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్లలో దొంతనం కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్టు పేర్కొన్నారు. 2022లో హైదరాబాద్‌లోని గచ్‌బౌలిలోని పబ్‌లో ఉన్న అతనిని పట్టుకోవడానికి వెళ్లిన పోలీసులపై ప్రభాకర్ కాల్పులు జరిపినట్టు తెలిపారు. ఫీజులు కట్టే సమయంలో విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, గృహాలను లక్ష్యంగా పెట్టుకుని ఒంటరిగా దొంగతనాలు చేస్తాడన్నారు. ఉండ్రాజవరం మండలం వేలివెన్ను కాలేజీలో రూ.30 లక్షలు, దేవరపల్లి మండలంలో రోమన్ కేథలిక్స్ స్కూల్లో రూ.3 లక్షలు చోరీ చేసినట్టు తెలిపారు. పారిపోయిన సమయంలో చేతికి హ్యాండ్ కప్స్, వైట్ కలర్ టీ షర్టు, బ్లాక్ కలర్ ట్రాక్ ప్యాంటు ధరించి ఉన్నట్టు తెలిపారు. ఎక్కడెక్కడ నేరాలు చేస్తున్నాడు, సన్నిహితుల ఆచూకీని తెలుసుకుంటున్నట్టు చెప్పారు. ముద్దాయి ఆచూకీ తెలిపిన వారికి రూ.50 వేల పారితోషికం ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు దేవరపల్లి పోలీసుల మొబైల్ నెంబర్లు 94407 96584 (సీఐ), 9440796624 (ఎస్సై)కు సమాచారం ఇవ్వాలని కోరారు.



డీఎస్పీ దేవకుమార్

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : ఏపీ సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో తిరుపతి జిల్లా కేంద్రంలో ఉన్న డా.బీ.ఆర్. అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ సొసైటీ కోఆర్డినేటర్ పద్మజ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన జారీచేశారు. తిరుపతి జిల్లా కేంద్రంలోని డా.బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో ఐబీపీఎస్ క్లర్క్, ప్రొబేషనరీ ఆఫీసర్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ పోటీ పరీక్షల టైర్–2 మెయిన్ పరీక్షలకు ఉచిత వసతితో పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా గ్రాడ్యుయేట్ పూర్తిచేసి ఉండాలని తెలిపారు. సంబంధిత పరీక్షల టైర్–1 ప్రిలిమినరీ పరీక్ష రాసి ఉండాలని పేర్కొన్నారు. ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు సైతం అర్హులన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలలోపు ఉండాలని పేర్కొన్నారు. రిజర్వేషన్ నిష్పత్తి (ఎస్సీలకు 80 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు 10 శాతం, ఓసీలకు 4 శాతం, పీడబ్ల్యూడీలకు 3 శాతం) ప్రకారం శిక్షణకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపిక చేసే అభ్యర్థులకు ఉచిత వసతితో పాటు రెసిడెన్షియల్ శిక్షణ 60 రోజులు ఇస్తామన్నారు. ఆన్‌లైన్‌లో అక్టోబర్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ అక్టోబర్ 12న, శిక్షణ అక్టోబర్ 22వ తేదీ నుంచి ప్రారంభిస్తారని తెలిపారు. అభ్యర్థులు తమ కుల, ఆదాయ, విద్యార్హత సరిఫికెట్లతో పాటు ఫొటో, టైర్–1 పరీక్ష వివరాలతో దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలన్నారు. హాల్‌టికెట్‌లు ఆన్‌లైన్ లోనే డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు www.apstdc.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 8639627455, 8142224539 నెంబర్‌లలో సంప్రదించాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

దళిత కుటుంబంపై కూటమి ఆటవిక చర్య

- న్యాయం చేయకపోతే నిరసనలు ఉధృతం చేస్తాం
- దళిత సంఘాల నాయకుల డిమాండ్

గంగవరం: దళితుల పక్షాన నిలబడి తమకు న్యాయం చేయాల్సిన కూటమి ప్రభుత్వం అగ్రవర్ణాలకు దాసోహమై దళితులపైనే దాడులు, దౌర్జన్యాలకు పూనుకోవడం సమంజసం కాదని దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని కల్లుపల్లి పంచాయతీ బూడిదపల్లిలో సోమవారం దళిత కుటుంబానికి చెందిన రేకుల ఇంటిని రెవెన్యూ, పోలీసు అధికారులు కూల్చివేసిన ఘటనపై నియోజకవర్గంలోని దళిత సంఘాల నాయకులు స్పందించారు. గంగవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. బాధితులైన నరసింహులు కుటుంబానికి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కె.వి.పి.ఎస్), వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు మద్దతుగా నిలిచారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఓబుల్‌రాజు మాట్లాడుతూ దళిత కుటుంబంపై కూటమి ప్రభుత్వ ఆటవిక చర్యగా పరిగణిస్తున్నామన్నారు. ఇదే గ్రామంలో టీడీపీకి చెందిన పెత్తందారీలు అనేకమంది కుంట పొరంబోకు, దళితుల శ్మశాన వాటిక దాదాపు 16 ఎకరాలకు పైగా ఆక్రమించుకుంటే అధికారులు నిద్రావస్థలో ఉన్నారని ఆరోపించారు. అదే పాడుబడిన బావి అనుకుని సెంటు స్థలంలో తరతరాలుగా ఉన్న రేకుల ఇంటిని కూల్చి నేలమట్టం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఘటన జరుగుతున్న సందర్భంలో నరసింహులు భార్య మణెమ్మ మనస్తాపానికి గురై అధికారుల కళ్లెదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించినా పట్టించుకోలేదన్నారు. చావు బతుకుల్లో ఉన్న మహిళను ఆస్పత్రికి తరలించకుండా ఇంటి నుండి పక్కకు తోసేసి బాధితులను నానా రకాలుగా దూషించడం దళిత హక్కులను ఉల్లంఘించడం కాదా అని ప్రశ్నించారు. ఆమె ప్రాణాలకు హాని జరిగితే అందుకు బాధ్యులు తహసీల్దార్ రేఖ, పోలీసు అధికారులే కారకులవుతారని హెచ్చరించారు. దళితులపై ఇంతటి వివక్ష చూపుతున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే గ్రామంలోని పెత్తందారీలు ఆక్రమించుకున్న పొరంబోకు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాధితులు చాలాసేపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపినా అధికారులు ఏమాత్రం స్పందించలేదు. తహసీల్దార్ రేఖ సెలవులో ఉండడంతో డీటీ సహానాకు అర్జీని సమర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు ఈశ్వర, బాధిత కుటుంబాల ప్రజలు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న బాధిత దళితులు, నాయకులు

తెలుగు ఉపాధ్యాయుడికి జాతీయ అవార్డు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు పాపయ్యకు జాతీయ అవార్డు లభించింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, ఉత్తమ విద్యాబోధనకు హైదరాబాద్‌కు చెందిన శారద ఎడ్యుకేషన్ సొసైటీ ఆయనను జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. వెదురుకుప్పం మండలం, బొమ్మయ్యపల్లికి చెందిన ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఈనెల 25న హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో నేషనల్ టీచర్ ఎక్స్‌లెన్స్ జాతీయ అవార్డును అందుకోనున్నారు. ఆయనకు డీఈవో వరలక్ష్మి, హెచ్ఎం హసన్‌బాషా, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



పాపయ్య

భార్య మందలించిందని!

బంగారుపాళెం: భార్య మందలించడంతో భర్త కనిపించకుండా వెళ్లిపోయాడు. భర్త అదృశ్యంపై మంగళవారం భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు.. మండలంలోని ఎర్రాండ్లపల్లె దళితవాడకు చెందిన శరత్‌బాబు(40) ట్రాక్టర్ డ్రైవర్. తరచూ మద్యం తాగి ఇంటికి వెళ్లేవాడు. ఈ నెల 17న మద్యం సేవించి ఇంటికి వెళ్లడంతో భార్య పుష్ప గొడవపడింది. దాంతో భార్యపై అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కనిపించలేదు. ఈ మేరకు భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శరత్‌బాబు (ఫైల్)

1,529 మందికి డీఎస్సీ నియామక పత్రాలు

- నేడు 7 గంటలకు రిపోర్టు చేసుకోవాలి
- విలేకరులతో డీఈవో వరలక్ష్మి



చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీఎస్సీలో ఎంపికైన 1,529 మంది అభ్యర్థులకు విజయవాడలో నియామకపత్రాలు అందజేయనున్నట్టు డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను విజయవాడకు తీసుకెళ్లే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎంపికైన అభ్యర్థులందరూ బుధవారం ఉదయం 7 గంటలకు తిరుపతి జిల్లా కేంద్రంలోని చదలవాడ ఇంజినీరింగ్ కళాశాల వద్దకు చేరుకోవాలని సూచించామన్నారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 84 బస్సుల్లో అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులను విజయవాడకు తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఇతర యాజమాన్యాల్లో ఎంపికైన 1,408 మంది అభ్యర్థులతో పాటు జోనల్ పోస్టుల్లో మోడల్ స్కూళ్లకు ఎంపికై 121 మందికి ఈ నెల 25వ తేదీన నియామకపత్రాలు అందుకోనున్నట్టు తెలిపారు. లైజన్ ఆఫీసర్‌లుగా నలుగురు డీవైఈవోలు వ్యవహరిస్తారన్నారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విడుదల చేసే ఉత్తర్వుల ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్టు తెలిపారు.

గృహ నిర్మాణాల పురోగతిలో అలసత్వం వద్దు

చిత్తూరు కలెక్టరేట్ : గృహ నిర్మాణాల పురోగతిలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో హౌసింగ్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాల వేగవంతంలో హౌసింగ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు కీలకపాత్ర పోషించాలన్నారు. వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో వెనుకబడితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం, ఈఈ శంకరప్ప, ఏఈలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

టిప్పర్ ఢీ

- స్కూటరిస్టు మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర శివారుల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.సుబ్రమణ్యం (52) అనే వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పూతలపట్టు మండలం, వావిల్‌తోటకు చెందిన సుబ్రమణ్యం తాపీ మేస్త్రీ. మంగళవారం చిత్తూరుకు వచ్చిన ఈయన, తన ద్విచక్ర వాహనంలో కాణిపాకం వైపు వెళుతున్నాడు. బెంగళూరు–తిరుపతి బైపాస్ రోడ్డు వద్ద ఓ టిప్పర్ లారీ వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సుబ్రమణ్యం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ ఏఎస్ఐ లోకనాథం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల్లో చోరీ

- ముగ్గురి అరెస్ట్
- రూ.32 వేలు స్వాధీనం

వి.కోట : మండలంలోని పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను మంగళవారం స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.32 వేలు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం రాత్రి స్థానిక కేజీఎఫ్ రోడ్డులో పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా వెళ్తున్న కర్ణాటక రాష్ట్రం, కొలారు జిల్లా, కమ్మెపల్లి గ్రామానికి చెందిన సోమ, లక్ష్మీ సాగరానికి చెందిన వెంకటేష్, రాజశేఖర్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈనెల 8వ తేదీ రాత్రి బంగ్లావూరు గ్రామంలోని బాటగంగమ్మ ఆలయంలోని హుండీని దోచుకెళ్లినట్టు ఒప్పుకున్నారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

బంగారుపాళెంలో భారీ వర్షం



బంగారుపాళెం: నిండుకుండలా గుంతూరు చెరువు



మొరవపోతున్న అనబండచెరువు



మొగిలి వద్ద ఎక్స్‌ప్రెస్ హైవే టెంట్లల్లోకి చేరిన నీరు

బంగారుపాళెం: మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. అటవీ ప్రాంతంలోని వాగు లు, వంకలు, చెక్‌డ్యాంలు సాగి చెరువులకు భారీగా నీరు చేరుతోంది. మండలంలోని మొగిలి గ్రామంలోని గొనిచెరువు, అనబండచెరువులు నిండి మొరవలు సాగుతున్నాయి. జంబువారిపల్లె, గుంతూరులోని వెంకటప్పనాయుని చెరువు, వీరప్పనాయుని చెరువులు నిండుకుండలా మారాయి. బలిజపల్లెలోని కామాక్షమ్మ చెరువుకు నీరు చేరుతున్నాయి. చీకలచెరువుకు నీరు చేరుతోంది. పాలేరులోని చిల్లామల చెరువుకు వంకలద్వారా నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. పాలేరు సమీపంలోని గజాగుండం జలపాతం వర్షపు నీటితో పరవళ్లు తొక్కుతోంది. బండరాయి మీదుగా జోరుగా నీరు ప్రవహిస్తోంది. మండలంలోని మొగిలి గ్రామ సమీపంలో అనబండచెరువు మొరవ పోవడంతో నీరు ఎక్స్‌ప్రెస్ హైవే పనులు జరుగుతున్న ప్రాంతానికి చేరుకోవడంతో కూలీలు బస ఉండే టెంట్లు నడుములోతు నిండాయి. రైతుల పంట పొలాలపైకి నీరు వచ్చిందని రైతులు అంటున్నారు. వేరుశెనగ పంటకు వర్షం ప్రతికూలంగా మారిందని రైతులు చెబుతున్నారు. తేమకు పంట దిగుబడి దెబ్బతినే అవకాశం ఉందని అంటున్నారు.

దౌర్జన్యం చేస్తున్నారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): భాగ పరిష్కారం ద్వారా సంక్రమించిన ఇంటి స్థలాన్ని ఆక్రమించేందుకు జీడీ నెల్లూరు మండలం పాత వెంకటాపురం పంచాయతీ గెరికలపల్లికి చెందిన సందీప్ నాయుడు, మనోహర్ నాయుడు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని అదే గ్రామానికి చెందిన మహాలక్ష్మి ఆరోపించారు. చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆమె మాట్లాడారు. తమ గ్రామంలో ఉన్న ఆస్తిని గతంలో పూర్వీకులు సమంగా పంచి ఇచ్చారని చెప్పారు. అయితే ఈ భూమిని ఆక్రమించేందుకు సందీప్ నాయుడు తప్పుడు పత్రాలు సృష్టించి వేధిస్తున్నారని వాపోయారు. వారి దౌర్జన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా తమ పైనే ఫిర్యాదు చేస్తారా అంటూ బెదిరించారని కన్నీటి పర్యంతమయ్యారు. సందీప్ నాయుడుతో పాటు అతని అనుచరులు బాబు నాయుడు, నీరజాక్షుల నాయుడు నుంచి ప్రాణహాని ఉందని చెప్పారు. జిల్లా ఎస్పీ స్పందించి చట్టపరంగా తమకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

బంగారుపాళెం: భార్య అదృశ్యంపై మంగళవారం ఆమె భర్త ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మండలంలోని కూర్మాయిపల్లెకు చెందిన వివాహిత (35) ఈనెల 17వ తేదీ కూలి పనులకు వెళ్లి వచ్చి ఇంట్లో భోజనం చేసి పడుకున్నట్లు తెలిపారు. మరుసటి రోజు ఉదయం నుంచి భార్య కనిపించక పోవడంతో ఆమె ఆచూకీ గురించి వాకబు చేసినట్లు తెలిపారు. ఉపయోగం లేకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ

బంగారుపాళెం: మండలంలోని గుండ్లకట్టమంచి వద్ద మంగళవారం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కేజీ సత్రానికి చెందిన మోహన్‌బాబు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై సిమెంటు బస్తాలను సంక్రాంతిపల్లెకు తీసుకెళ్తుండగా బెంగళూరు నుంచి చెన్నై పోతున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మోహన్‌బాబు కుడికాలు విరిగింది. కేరళకు చెందిన బైక్ రైడర్‌కు స్వల్పగాయాలయ్యాయి. మోహన్‌బాబును చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అప్పు చెల్లించలేదని హత్య?

–పూతలపట్టులో హోటల్ యజమాని ఘాతుకం

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు మండల పరిధి, రంగంపేట క్రాస్ సమీపంలోని ఓ హోటల్ యజమాని తన దగ్గర పనిచేస్తున్న ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన మండలంలో చర్చనీయాంశమైంది. పోలీసుల కథనం.. రంగంపేట క్రాస్ సమీపంలోని ఓ ప్రముఖ కర్మాగారం దగ్గర బంగారుపాళ్యంకు చెందిన విజయ్‌నాయుడు హోటల్ నడుపుతున్నాడు. చంద్రగిరి మండలం, ఐతేపల్లి గ్రామానికి చెందిన రూబన్(42) ఆ హోటల్‌లో పనిచేయడానికి సదరు యజమానిని అడిగాడు. అందుకు సమ్మతించిన విజయ్‌నాయుడు అడ్వాన్సుగా రూ.20 వేలు రూబన్‌కి ఇచ్చాడు. డబ్బులు తీసుకున్న తరువాత ఎంతకీ విధులకు రాకపోవడంతో విషయాన్ని రూబన్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారి సూచన మేరకు కొద్దిరోజులుగా రూబన్ హోటల్‌లో పనిచేసుకుంటున్నాడు. సోమవారం రాత్రి విధులు పూర్తయ్యాక విజయ్‌నాయుడు, అతని స్నేహితుడు శ్రీను, రూబన్ ముగ్గురూ కలసి తిమ్మిరెడ్డిపల్లి జగనన్న కాలనీలోని రూబన్ ఇంటికి వెళ్లారు. అక్కడ ముగ్గురూ మద్యం సేవించారు. మద్యం మత్తులో రూబన్ తీసుకున్న డబ్బుల విషయంగా అక్కడ వాగ్వాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. విజయ్‌నాయుడు, రూబన్ మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. విచక్షణ కోల్పోయిన విజయ్‌నాయుడు, అతని స్నేహితుడు శ్రీను రూబన్‌పై దాడి చేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో భయాందోళనకు గురైన విజయ్ పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు సోమవారం రాత్రి రూబన్‌ను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మంగళవారం మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తీసుకున్న అప్పు చెల్లించలేదనే రూబన్‌ను హత్య చేశారని మృతుని బంధువులు ఆరోపిస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.



రూబన్ మృతదేహం



అంబులెన్సులో తరలిస్తూ..

ఓ నారీ..ఆరోగ్యంపై అశ్రద్ధ తగదు

యాదమరి: ప్రస్తుత సాంకేతిక యుగంలో తీరిక లేని సమయాన్ని గడుపుతున్న నారీమణులు తమ ఆరోగ్యంపై అశ్రద్ధ వహించడం అంత క్షేమం కాదని జిల్లా వైద్యాధికారి సుధారాణి అన్నారు.ఆమె స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మోర్దానపల్లిలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మానవ ఆరోగ్యాన్ని కబళిస్తున్న మధుమేహం, రక్తపోటు, మహమ్మారి వివిధ రకాల క్యాన్సర్లు బయటపడితే అటువంటి వారికి మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. ఈనెల 25న యాదమరి పీహెచ్‌సీలో వైద్య నిపుణులచే ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డా.అనిల్‌కుమార్ నాయక్ చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసమూర్తి, సూపర్‌వైజర్‌లు లక్ష్మీపతి, సెలవరాణి, వైద్య సహాయకులు సురేంద్రనాథరెడ్డి, సర్పంచ్ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సుధారాణి